క్లుప్తంగా

పేదలందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ వెంకటరమణ

దక్కిలి: అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయని గూడూరు డీఎల్‌పీఓ వెంకటరమణ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఈఓపీఆర్డీ అల్లాబక్షు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

వెంకటగిరిరూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలు సమస్యల పరిష్కారం దిశగా చేపడుతున్న నిరసనలకుగాను బుధవారం వెంకటగిరిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్లు స్థానిక నేదురుమల్లి నివాసం వద్దకు చేరుకుని తమ సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా పట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలోని 14 సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు కనీసం వేతనం సౌకర్యం కల్పించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. స్పందించిన నేదురుమల్లి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తన వంతు కృషిచేయనున్నట్లు తెలియజేశారు.

సాదాబైనామాపై గ్రామసభ



మాట్లాడుతున్న తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి

దొరవారిసత్రం: మినమనముడి గ్రామంలో సాదాబైనామాపై రైతులకు రెవెన్యూ అధికారులు బుధవారం గ్రామసభ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా స్థానిక తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామానికి చెందిన 65 మంది రైతులకు 46.05 ఎకరాల భూమి సాదాబైనామా కింద ఉండగా ఈగ్రామ సభ ద్వారా ఆమోదం పొందిందన్నారు. వీరిందరికి త్వరలోనే భూహక్కు పత్రాలను అందజేస్తామని తహసీల్దార్ రైతులకు తెలియజేశారు. మండల కన్వీనర్ శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ అరుణ, వీఆర్వో వెంకటరత్నం పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ నియామకం



పర్వతరెడ్డి కవిత

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా పర్వతరెడ్డి కవితను వైఎస్సార్ సీపీ అధిష్టానం ఎంపిక చేసింది. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఉత్తర్వులను అందజేసి కమిటీని ఎంపిక చేశారు. నాయుడుపేట కమిటీకి తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డిని, సూళ్లూరుపేట కమిటీకి పర్వతరెడ్డి కవితను ఎంపిక చేశారు. ఈనెల 29న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేయనున్నారు. అయితే ఇంత బాధ్యత కలిగిన పదవిని తమకు కట్టబెట్టినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు ప్రత్యేకంగా పర్వతరెడ్డి దంపతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

రైతు భరోసా కేంద్రాల పరిశీలన



స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సైదాపురం: మండలంలోని రైతు భరోసా కేంద్రాలను బుధవారం మార్క్‌ ఫెడ్ మేనేజర్ పవన్‌కుమార్, ఏఓ నీరజ, సైదాపురం ఏఓ హైమావతి పరిశీలించారు. ఈసందర్భంగా రబీ సీజన్‌లో రైతులకు కావాల్సిన ఎరువులను ఆయా రైతు భరోసా కేంద్రాల్లో నిల్వ చేసినట్లు వారు చెప్పారు.

రాపూరులో నేదురుమల్లి పర్యటన రేపు

రాపూరు: రాపూరులో శుక్రవారం తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలక కన్వీనర్ దయాకర్‌రెడ్డి, జేసీఎస్‌కన్వీనర్ నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

కండలేరులో 13.055 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం 13.055 టీఎంసీలు నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పండుగలా ఆడుదాం ఆంధ్రా

• ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు



గూడూరులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరురూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు తమలోని సత్తాను చాటుకునేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టారని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని క్రీడా మైదానంలో రెండవ రోజు నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో క్రీడాకారులను పరిచయం చేసుకుని ఆడుదాం ఆంధ్రాపై అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, నేతలు సతీష్‌రెడ్డి, రాఘవరెడ్డి, జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు, పీడీలు, సచివాలయం సిబ్బంది, పీఈటీలు పాల్గొన్నారు

సైదాపురంలో..

సైదాపురం: పొక్కందల గ్రామ పంచాయతీల్లో బుధవారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని అట్టహాసంగా జెండాను ఆవిష్కరించి ఆటల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్రామయ్య పాల్గొన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: అంకులపాటూరులో క్రికెట్ పోటీలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్‌నాయుడు, సర్పంచ్ వజ్రమ్మ పాల్గొన్నారు. అలాగే బల్లవోలులో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. వరగలి, లింగవరం, ఓడూరు, ముత్యాలపాడు పంచాయతీలలో కూడా క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ఎంపీడీఓ వెంకటసూర్యసాయి పర్యవేక్షించారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం: ఉచ్చూరు, సూరపుఅగ్రహారం, కల్లూరు, డీవీ సత్రం బీసీ గురుకుల పాఠశాలల్లో రెండవ రోజు బుధవారం ఆడుదాం ఆంధ్ర పోటీలు పోటాపోటీగా జరిగాయి. డీవీసత్రం బీసీ గురుకుల పాఠశాలలో జరిగిన క్రికెట్ పోటీలను వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఎంపీడీఓ రఘురామయ్య పాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఎంపీడీఓ సురేష్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అధికారులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓజిలిలో..

ఓజిలి: ఆర్మేనిపాడు ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు రవీంద్రరాజు ఎంపీటీసీ సభ్యుడు రఘురామరాజు, సర్పంచ్ పోలయ్య, నేతలు కె.వెంకటసుబ్బరాజు, సుకుమార్‌రాజు, మధురాజు, పంచాయతీ కార్యదర్శి పెద్దమస్తానయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

రాపూరులో..

రాపూరు: మండలంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలను రాపూరు, పెనుబర్తి, కండలేరులో బుధవారం ప్రత్యేక అధికారి తిరుపతయ్య పరిశీలించారు. ఎంపీడీఓ అప్పాజీ, నేతలు రమణారెడ్డి, పీడీలు వెంకట్, శివ ఉన్నారు.

కోటలో..

కోట: కేసవరం, సిద్దమ్మకండ్రిగ జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన పోటీల్లో కేసవరం జట్టు విజయం సాధించింది.స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు శ్రీరాంగురుస్వామి, ప్రసాద్ పోటీలను ప్రారంభించారు. పీఈటీలు సంధానీ, వలీఅహ్మద్ పర్యవేక్షణలో వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు.



కేసవరంలో..



ఆర్మేనిపాడులో..



పొక్కందలలో..



అంకులపాటూరులో..



డీవీ సత్రంలో క్రికెట్ క్రీడాకారులు



లవకూరులో..

డీవీ సత్రంలో మండల సమాఖ్య సమావేశం



మండల సమాఖ్య సమావేశం

దొరవారిసత్రం: దొరవారిసత్రంలోని సంఘ మిత్ర కార్యాలయంలో బుధవారం మండల సమాఖ్య సమావేశం స్థానిక ఏపీఎం పద్మావతి ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా వైఎస్సార్ ఆసరాపై సమావేశం నిర్వహించారు. అనంతరం సంఘం బంధంలోని సభ్యులు రూ.200 నుంచి 500 వరకు పొదుపును పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి బ్యాంకు ద్వారా పొందే రుణాలు సకాలంలో చెల్లించడమేకాకుండా రుణాలు దుర్వినియోగం చెయ్యకుండా పొదుపు మహిళలు వినియోగించుకోవాలని కోరారు. బ్యాంకు రుణాలు ఓవర్‌డ్యూ కాకుండా సకాలంలో సంఘం సభ్యులు చెల్లించేలా వీఏఓ కృషి చేయాలన్నారు. అధ్యక్షురాలు భారతి, ఎల్‌సీసీ మునేయ్య, సీసీ చంద్రయ్య పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వెంకటగిరిరూరల్: పట్టణంలోని 14వ వార్డు బొగ్గుల మిట్ట ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉదయం 6.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు నేదురుమల్లి కార్యాలయ వర్గాల నుంచి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి



సుబ్బారెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

చిల్లకూరు: మండలంలోని నెలబల్లిరెట్టపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత యల్లా సుబ్బారెడ్డి చిత్ర పటం వద్ద బుధవారం గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు నివాళులర్పించారు. సుబ్బారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ క్రమంలో గ్రామంలోని ఆయన ఇంటి వద్ద కర్మక్రతువులకు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు హాజరై సుబ్బారెడ్డి చిత్ర పటం వద్ద పూల వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నేతలు యల్లా శ్రీనివాసులరెడ్డి, మైలాం శ్రీనివాసులరెడ్డి, వెందోటి మధుసూదన్‌రెడ్డి, అన్నంరెడ్డి రమేష్‌రెడ్డి, బి. సుబ్రహ్మణ్యం, నారాయణరెడ్డి ఉన్నారు. అలాగే పనబాక క్రిష్ణయ్య, పరసారత్నం సుబ్బారెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

భూములకు హక్కు కల్పించండి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న తీపనూరు మహిళలు

చిల్లకూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 20 ఏళ్లకు పైగా సాగులో ఉన్న వారికి ఆ భూములపై హక్కులు కల్పించేలా చర్యలు చేపట్టిన క్రమంలో గత 30 ఏళ్లగా తమ అనుభవంలో ఉన్న భూములపై తమకు హక్కులు కల్పించాలని తీపనూరుకు చెందిన మహిళలు బుధవారం తహసీల్దార్ శ్రీనివాసులను కలిసి వినతి పత్రం అందించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో తీపనూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శ్రీపతి నరసమ్మ ఆధ్వర్యంలో 23 మంది మహిళలు తహసీల్దార్‌ను కలసి తమకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. వారు మాట్లాడుతూ మరోసారి అసైన్‌మెంటు పట్టాలు మంజూరు చేసే క్రమంలో తమకు కూడా హక్కులు కల్పించేలా పట్టాలు మంజూరు చేయాలని కోరారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ ఇప్పటికే ఒక పర్యాయం జాబితాను సిద్ధం చేశామని రెండవ విడతలో కచ్చితంగా పట్టాలు మంజూరు చేసేలా చర్యలు చేపడతామని అన్నారు.

13 షాపులకే టెండర్ దరఖాస్తులు

తిరుపతి అర్బన్: తిరుపతి బస్టాండ్ మినహా జిల్లాలో ఖాళీగా ఉన్న 33 ఆర్టీసీ దుకాణాలకు బుధవారం తిరుపతి డీపీటీఓ కార్యాలయంలో బుధవారం టెండర్లు నిర్వహించారు. డెప్యూటీ సీటీఎం భాస్కర్, పీఓ పార్థసారధి, డీఎం బాలాజీ నేతృత్వంలో టెండర్లు చేపట్టారు. అయితే 13 దుకాణాలకు సంబంధించి మాత్రమే 28 దరఖాస్తులను విక్రయించారు. అందులో 23 దరఖాస్తులను మాత్రమే వేశారు. మరో నాలుగు రోజుల్లో 13 షాపులకు సంబంధించి వచ్చిన 23 టెండర్లను పరిశీలించి ఖరారు చేయనున్నారు. అయితే టెండర్లు ఆహ్వానించిన నాటి నుంచి పెద్దఎత్తున అవగాహన చేయకపోవడంతోనే అన్ని దుకాణాలకు దరఖాస్తులు అందలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. 20 దుకాణాలకు ఒక్క టెండర్ వేయకపోవడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్ని దుకాణాలు భర్తీ చేస్తే.. బస్టాండ్‌లో నిర్వహిస్తున్న దుకాణాలకు వ్యాపారం తగ్గుతుందనే ఉద్దేశంతోనే ఆర్టీసీ అధికారులు టెండర్ల అంశాన్ని పెద్దఎత్తున ప్రచారం చేయలేదని తెలుస్తోంది. ఖాళీ దుకాణాలను సక్రమంగా భర్తీ చేయకపోవడంతో ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతుందని పలువురు మండిపడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగిస్తుంది



పథకాల లబ్ధిని వివరిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

• నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: 2024వ సంవత్సరంలో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగిస్తుందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 14వ వార్డు బొగ్గులమిట్ట ప్రాంతంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా బొగ్గుల మిట్టకు విచ్చేసిన నేదురుమల్లికి ఘనస్వాగతం పలికారు. మంచును సైతం లెక్క చేయకుండా ఇంటింటికి వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్లను అందజేశారు. నేదురుమల్లి మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమపథకాలు అందించాలని సచివాలయం సిబ్బందికి, వలంటీర్లను ఆదేశించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతుశారద, స్థానిక వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య, వహిద, ఆటంబాకం శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నేతలు దొంతుబాల, సీహెచ్ మురళి, శ్రీరామ్ రమణమ్మ, కొండూరు గోపాల్‌రాజు, నారాయణ, శివ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి



అధికారులను కలిసిన రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు

– బోర్డు సభ్యుల అభ్యర్థన

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసి ఈ స్టేషన్‌ను మోడల్ స్టేషన్‌గా తీర్చిదిద్దాలని సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీకి నూతనంగా ఎంపికైన సభ్యులు స్టేషన్ అధికారులకు విన్నవించారు. సదరన్ రైల్వే చెన్నై డివిజన్ వారు సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులుగా ముతుకు కోటయ్య గౌడ్, ఆలతూరు సుబ్రమణ్యంరెడ్డి, కాసంశెట్టి నిర్మలకుమారి, దుర్గి రమేష్ కుమార్, పిచ్చిక సూరిబాబులను ఎంపిక చేశారు. ఈ కమిటీ సభ్యులందరూ కలిసి బుధవారం స్టేషన్ మాస్టర్ రంజిత్‌కుమార్, స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌సింగ్, స్టేషన్ కమర్షియల్ సూపర్‌వైజర్ ప్రభాకర్, వినోద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి స్టేషన్‌లో వున్న సమస్యలను విన్నవించారు. రాత్రివేళల్లో స్టేషన్ భద్రత, స్వచ్ఛభారత్, స్టేషన్‌లో రెండో బుకింగ్‌కౌంటర్‌ల విషయాన్ని వారు ప్రస్తావించారు. స్టేషన్‌లో పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యను దృష్టిలో వుంచుకుని రెండో ఫుట్ ఓవర్ బ్రిడ్జి స్టేషన్‌కు దక్షిణం వైపున నిర్మించాలని కోరారు. ఈ పనులన్నింటిని రాబోయే ఆరు నెలల్లోనే పూర్తి చేసి స్టేషన్‌ను మోడల్ స్టేషన్‌గా తీర్చిదిద్దబోతున్నామని కమిటీకి స్టేషన్ అధికారులు మాట ఇచ్చారు.

జగనన్నకు చెబుదాంకు 12 అర్జీలు



హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

తడ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా ప్రజాసమస్యలు ఎప్పటికప్పుడు నెరవేరుస్తున్నప్పటికీ ఇంకా పరిష్కారం కాని సమస్యలు ఉంటే వాటిని కూడా నెరవేర్చి వంద శాతం ప్రజాసమస్యలు పరిష్కరించే దిశగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమం బుధవారం తడ ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఇందులో మండలం నుంచి 12 సమస్యలకు సంబంధించిన విజ్ఞప్తులు మాత్రమే అధికారులకు అందాయి. వీటికి సంబంధించిన వివరాలను జగనన్నకు చెబుదాం సైట్‌లో రిజిస్టర్ చేశారు. ఎంపీపీ కొళవి రఘురెడ్డి, తహసీల్దార్ కటారి జయజయరావు, ఎంపీడీఓ ఆమోసుబాబు, వైస్ ఎంపీపీలు వెంకటేష్, రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఖాజా మోహిద్దీన్

రాపూరు: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని నెల్లూరు జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఖాజామోహిద్దీన్ అన్నారు. రాపూరులోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రస్తుతం ఉన్న టెక్నాలజీని ఉపయోగించుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. నిత్యం విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. హాజరును బట్టి అమ్మ ఒడి పథకం వర్తిస్తుందని విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని ఆయన ఈ సందర్భంగా ఆయన తెలిపారు. సమ్మెటివ్ పరీక్షల మార్కులను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. వర్క్‌బుక్స్ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తిచేయాలని ఆయన సూచించారు.

జోరుగా యూరియా విక్రయాలు



ముత్యాలపాడు ఆర్బీకేలో యూరియాను తీసుకెళుతున్న రైతులు

చిల్లకూరు: రైతులకు సౌకర్యవంతంగా ఉండేలా ఆర్బీకేల ద్వారా యూరియా, డీఏపీలను విక్రయించేందుకు చర్యలు చేపట్టడంతో జోరుగా విక్రయాలు కొనసాగుతున్నాయి. మండలంలోని ప్రతి ఆర్బీకే నుంచి ప్రతిరోజూ రైతులు యూరియా, డీఏపీలను కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ముత్యాలపాడు ఆర్బీకే నుంచి బుధవారం 250 యూరియా బస్తాలను రైతులకు విక్రయించినట్లు వ్యవసాయ సహాయకులు చెంచుక్రిష్ణయ్య తెలిపారు. అలాగే చేడిమాల ఆర్బీకే కేంద్రానికి వచ్చిన డీఏపీ బస్తాలను తిప్పగుంటపాళెంలోని పీఏసీఎస్ ద్వారా విక్రయించేలా చర్యలు చేపట్టామని ఏఓ భవాని తెలిపారు. రైతులు పట్టణ ప్రాంతాలలోని ఎరువుల దుకాణాలకు వెళ్లి ఎరువులు కొనుగోలు చేసుకుని వాటిని వ్యయప్రయాసలకు ఓర్చి గ్రామానికి తీసుకుని వచ్చేందుకు ఆటో బాడుగలు చెల్లించాల్సి వస్తుందని వీటిని తగ్గించి రైతుకు గ్రామంలోని ఆర్బీకే ద్వారా ఎరువులను విక్రయిస్తున్నట్లు తెలిపారు.